సాక్షి ఏలూరు

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



ఘనంగా చండీహోమం

పెనుగొండ: మాఘ పౌర్ణమి సందర్భంగా పెనుగొండలోని వాసవీ శాంతి ధాం, మూలవిరాట్ వాసవీ ఆలయాల్లో చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



శ్రీవారి సేవలో మంత్రి వనిత

ద్వారకాతిరుమల: చిన వెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: చిన వెంకన్న నిత్యాన్న దాన ట్రస్టుకు నిడదవోలుకు చెందిన పాలి బాల మురళీకృష్ణ రూ.1,11,000లను విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

జిల్లాలో గ్రూప్-2 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు



వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్

ఏలూరు(మెట్రో): ఏపీ పీఎస్సీ గ్రూప్-2 పరీక్షకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఆదివారం ఉదయం జరిగే పరీక్షకు జిల్లాలో 39 కేంద్రాల్లో 13,977 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. 39 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్లు ఆఫీసర్లను నియమించామన్నారు. ఏపీపీఎస్సీ నుంచి ఇద్దరు సెక్షన్ అధికారులు వచ్చారన్నారు. మెటీరియల్ పంపిణీకి 19 రూట్లుగా విభజించి 19 మంది జిల్లా అధికారులను నియమించామన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. అభ్యర్థులు సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశామన్నారు. కంట్రోల్ రూమ్ నం. 94910 41436, ఏఎం మాధవీలత, సెక్షన్ ఆఫీసర్, ఏపీపీఎస్సీ-9014550897, పి.గిరిజారాణి, సెక్షన్ ఆఫీసర్, ఏపీపీఎస్సీ-9912107709లో సంప్రదించవచ్చన్నారు.

పటిష్ట బందోబస్తు

ఏలూరు టౌన్: జిల్లాలో ఆదివారం జరిగే గ్రూప్-2 పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. పరీక్షల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, నిరసనలకు అనుమతులు లేవన్నారు. జిల్లావ్యాప్తంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, సెక్షన్ 144 సీఆర్‌పీసీ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల వద్ద మహిళా అభ్యర్థులను పరీక్షించేందుకు మహిళా పోలీసులను నియమించామన్నారు. కేంద్రాల సమీపంలో ఇంటర్‌నెట్ సెంటర్లు, జిరాక్స్ కేంద్రాలు మూసివేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది నియమించామన్నారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేటు తప్పనిసరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేని కొత్త, పాత వాహనాలపై కేసులు నమోదు చేస్తామని ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ప్రకటనలో తెలిపారు. ఈ నంబర్ ప్లేటు లేకుండా వాహనాలకు ఫిట్‌నెస్, రెన్యూవల్ చేయమని పేర్కొన్నారు. కొత్త వాహనాలకు డీలర్ల వద్దనే నంబర్ ప్లేట్లు బిగిస్తుండగా, పాత వాహనాలకు వచ్చేనెల 1 నుంచి ఎస్ఐఏఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వాహనదారులు మరింత సమాచారం కోసం సంబంధిత రవాణా శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్, ఈవీఎంల భద్రతకు అవసరమైన స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు సంబంధించి స్థానిక సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలను శనివారం రిటర్నింగ్ అధికారులు ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, ఆర్డీఓలు ఎస్ఎస్‌కే ఖాజావలీ, భవాని శంకరి, అద్దయ్య, ముక్కంటి తదితరులు పరిశీలించారు. ప్రాంగణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సర్వే తదితరాలపై సిబ్బందికి సూచనలిచ్చారు. నియోజకవర్గాల వారీగా గదుల కేటాయింపు, ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే ఈవీఎంలు, వీవీప్యాట్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూములు, అక్కడ నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు భద్రత తదితర అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.

టీడీపీ సీనియర్లకు మొండిచేయి



- చింతమనేని, గన్ని టికెట్లు పెండింగ్
- జిల్లాలో సీట్ల ప్రకటనలో బోణీ కొట్టని జనసేన
- పవన్ కళ్యాణ్ సీటుపై స్పష్టత కరువు
- ఉండి, తణుకులో అసంతృప్తికి ఆజ్యం
- నూజివీడులో జంపింగ్ నేతకు టికెట్
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు సీట్లు ప్రకటించిన టీడీపీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తెలుగుదేశం ప్రకటించిన తొలి జాబితాలో సీనియర్లకు మొండిచేయి చూపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నేతలను పూర్తిగా పక్కకు తప్పించగా ఇన్‌చార్జిలు, కీలక నేతలుగా చెలామణి అవుతున్న వారి టికెట్లను కూడా పెండింగ్‌లో పెట్టి గట్టి షాక్ ఇచ్చారు. ఇక జనసేనకు సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరిలో పవన్ కళ్యాణ్ సీటు సహా ఒక్క స్థానాన్ని కూడా ప్రకటించుకోలేని పరిస్థితి. మొత్తంగా నూతన ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 14 నియోజకవర్గాల్లో 7 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను ప్రకటించింది. తణుకులో జనసేన ఇన్‌చార్జి, ఉండిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యేల అసమ్మతి తారాస్థాయికి చేరింది. రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించే దిశగా ఈ ఇద్దరు నేతలు సమాలోచనల్లో ఉన్నారు.

పొత్తులు తేలక అయోమయం

టీడీపీ పాలకొల్లు, ఉండి సిట్టింగ్ ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, తణుకు ఇన్‌చార్జి ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏలూరు సిటీ ఇన్‌చార్జి బడేటి రాధాకృష్ణ (చంటి), చింతలపూడి ఇన్‌చార్జి సొంగా రోషన్, నూజివీడు ఇన్‌చార్జి కొలుసు పార్థసారధి, ఆచంట ఇన్‌చార్జి పితాని సత్యనారాయణను అభ్యర్థులుగా ప్రకటించింది. మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో పొత్తులు తేలక అభ్యర్థిత్వాలపై పలు సందేహాలు, ఇతర కారణాలతో పెండింగ్‌లో పెట్టడం జిల్లాలో కాక రేపుతోంది.

చింతమనేని, గన్నికి సీట్లు దక్కేనా..!

ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఉంగుటూరు ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు భవితవ్యం పెండింగ్‌లో పడింది. దెందులూరు ఇన్‌చార్జి చింతమనేని ప్రభాకర్ టికెట్ కూడా పెండింగ్‌లో ఉండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మేమే టీడీపీ.. మాదే టీడీపీ అంటూ జిల్లాలో అడ్డగోలుగా వ్యవహరించే ఇద్దరు నేతలకు తొలి జాబితాలో టికెట్ రాకపోవడం కేడర్‌లో అనుమానాలను రేకెత్తిస్తోంది. ఉంగుటూరు అభ్యర్థికి టికెట్ దక్కదని, జనసేనకు టికెట్ ఖరారయ్యే అవకాశం ఉందని రెండు పార్టీల్లోనూ బలంగా ప్రచారం సాగుతోంది. ఇక చింతమనేని ప్రభాకర్‌కు ఈ ఏడాది ఒక కేసులో రెండేళ్ల జైలు శిక్ష విధించారు. దానిపై ప్రస్తుతం ఆయన స్టే తీసుకున్నారు. 2011 నవంబర్ 26న దెందులూరు జెడ్పీ స్కూల్లో అప్పటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడి చేశారనే ఉదంతంపై నమోదైన కేసుకు సంబంధించి భీమడోలు కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దీనిపై చింతమనేని జిల్లా కోర్టుకు అప్పీలుకు వెళ్లి స్టే తీసుకున్నారు. ఈ కారణంతో పెండింగ్ పెట్టారని ఒక వర్గం, నియోజకవర్గంలో చంద్రబాబు సామాజికవర్గ నేతలు చింతమనేనిని మార్చాలని గట్టిగా డిమాండ్ చేసిన నేపథ్యంలో పునరాలోచన నడుస్తోందని పార్టీలోని మరో వర్గం నేతలు చెబుతున్నారు.


సుజాతను తప్పించి.. ముద్దరబోయినకు ముంచేసి..

పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలుగా మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మికి గతంలోనే టికెట్ లేదని స్పష్టత ఇచ్చారు. కనీసం ఏదో ఒక నియోజకవర్గానికి ఆమె పేరును పరిశీలించకపోవడం గమనార్హం. ఇక చింతలపూడి, ఆచంటలో గెలుపొందిన మాజీ మంత్రి పీతల సుజాతను 2019 నుంచే పక్కన పెట్టారు. 2024లో కూడా టికెట్ ఇవ్వకుండా పూర్తిగా తప్పించి ఆమె స్థానంలో ఎన్ఆర్ఐ సొంగా రోషన్ కుమార్‌కు చింతలపూడి అసెంబ్లీ టికెట్ కేటాయించారు. ఇక నూజివీడు నియోజకవర్గంలో రెండు సార్లు ఓడిపోయినా పదేళ్లుగా పార్టీ జెండా మోసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు హ్యాండ్ ఇచ్చి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయిన కొలుసు పార్థసారధిని అభ్యర్థిగా ప్రకటించారు. ఈయన ఇప్పటివరకు టీడీపీలో చేరకపోయినా టికెట్ దక్కడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

పవన్ కళ్యాణ్‌కే దిక్కులేదు

జనసేన తొలి జాబితాలో పవన్ కళ్యాణ్ పేరు లేదు. భీమవరంలో గెలుపుపై అనుమానాలు ఉండటంతో పెండింగ్‌లో పెట్టారు. అలాగే పవన్ కళ్యాణ్‌పై పూర్తి ఆశలు పెట్టుకున్న తణుకు జనసేన ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావుకు హ్యాండ్ ఇచ్చారు. ఇటీవల తణుకు సమావేశంలో పొత్తుల్లో ఉన్నా సరే విడివాడ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉంటారంటూ కేడర్‌కు స్పష్టంగా చెప్పిన పవన్.. చివరికి హ్యాండిచ్చారు. ఆరిమిల్లిని టీడీపీ తమ అభ్యర్థిగా ప్రకటించడంతో విడివాడ అసంతృప్తికి గురై కేడర్‌కు అందుబాటులో లేకుండా ఇంట్లోనే ఉండిపోయారు. ఇక ఉండిలో మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు టీడీపీ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించి భంగపడ్డారు. దీంతో ఆదివారం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పి అంతర్వేది వెళ్లిపోయారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఏలూరులో 'అన్న వచ్చే.. ఆశ తెచ్చే' అంటూ ఫ్లెక్సీలతో నానా హడావుడి చేసిన జనసేన నేత నారా శేషు, జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన రెడ్డి అప్పలనాయుడుకు మళ్లీ అవకాశం ఇస్తామని చెప్పి హ్యాండివ్వడంతో వీరిద్దరూ షాక్‌లో ఉన్నారు.

భీమవరంలో బిక్కముఖమేనా?



- తొలి జాబితాలో పేరు ప్రకటించుకోని పవన్ కళ్యాణ్
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ పునరాలోచనలో జనసేనాని
- ఇప్పటివరకూ ఇక్కడి నుంచే పోటీ చేస్తారని ప్రచారం
- ఇటీవలే టీడీపీ నేతలను కలిసి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం
- టీడీపీ, జనసేన అంతర్గత విభేదాలతో పవన్ వెనుకడుగు
- తీవ్ర నైరాశ్యంలో జనసేన కేడర్

సాక్షి, భీమవరం: జనసేనాని పవన్ కళ్యాణ్ భీమవరం బరిలోకి దిగేందుకు జంకుతున్నారా? గతంలో మాదిరి ఓటమి పాలైతే ఇక రాజకీయ భవిష్యత్ శూన్యమేనా? పోటీ చేసే విషయంలో పునరాలోచనలో పడ్డారా? మిత్రపక్షం టీడీపీ, తన కేడర్ మధ్య కుమ్ములాటలు, మరోపక్క ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ 'లోకల్' చరిష్మా తనకు చేటు చేస్తాయని భావిస్తున్నారా? అంటే అవునన్న సమాధానాలే వస్తున్నాయి. ఇటీవల భీమవరంలో టీడీపీ, బీజేపీ నేతలను కలిసి వారి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేయడంతో పవన్ ఇక్కడి నుంచే పోటీ చేస్తారన్న ప్రచారానికి బలం చేకూరింది. అయితే తాజాగా విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో తన పేరు ప్రకటించుకోకపోవడంతో ఆ పార్టీ కేడర్ పూర్తి నైరాశ్యంలో పడిపోయింది.

గత ఎన్నికల్లో ఘోర ఓటమి

2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా భీమవరం నుంచి పవన్ కళ్యాణ్ పోటీలో నిలిచారు. జననేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనం, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ లోకల్ బలం ముందు పవన్‌కు ఘోర పరాజయం తప్పలేదు. 8,500 పైగా ఓట్లతో ఆయన పరాజయాన్ని చవిచూశారు. ఎన్నికల సమయంలో భీమవరంలో మకాం ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చినా ఎన్నికల అనంతరం గత ఐదేళ్లలో రెండు, మూడుసార్లు తప్ప భీమవరం ప్రజలకు ఆయన దర్శన భాగ్యం కలగలేదు. దీంతో పార్టీ కేడర్ తీవ్ర అసంతృప్తిగా ఉంది. కొద్దినెలల క్రితం పవన్ భీమవరం వచ్చిన సందర్భంగా సొంత పార్టీ నేతలకే ఆయన్ని కలిసే అవకాశం దక్కలేదు. 'పార్టీ కోసం లక్షలు ఖర్చుపెడుతున్న తమకే అధినేతను కలిసే భాగ్యం కలగలేదు. ఇంకా మీకెక్కడ' అంటూ కొందరు నేతలను ఉద్దేశించి జనసేన పార్టీ వీరవాసరం జెడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్‌నాయుడు చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెను దుమారమే రేపాయి.

మద్దతు కోసం కలిసి.. మౌనంగా మారి..

రానున్న ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం కొద్దిరోజులుగా సాగుతోంది. టీడీపీలో గ్రూపు విభేదాలను చక్కదిద్ది వారి మద్దతు కూడగట్టుకునేందుకు రెండు రోజుల క్రితం భీమవరం పర్యటనకు ఆయన విచ్చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, బీజేపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ పాకా సత్యనారాయణ నివాసాలకు వెళ్లి స్వయంగా వారిని కలిసి మద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా భీమవరం నుంచి పోటీ చేస్తున్నట్టు పవన్ ప్రకటించకపోయినా ఇక లాంఛనమే అని పార్టీ కేడర్ భావించింది. స్థానికంగా ఆయన ఉండేందుకు అనువైన ఇంటి కోసం ప్రయత్నిస్తున్నట్టు కూడా చర్చ జరిగింది.

ఐదేళ్ల అభివృద్ధి ఆందోళనతోనే..

శనివారం పవన్ విడుదల చేసిన జనసేన పార్టీ అభ్యర్థుల మొదటి జాబితాలో తాను పోటీ చేసే స్థానం ప్రకటించకపోవడం పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది. మిత్రపక్ష భాగస్వామి చంద్రబాబు కుప్పం నుంచి పోటీచేస్తున్నట్టు ప్రకటించగా భీమవరం నుంచి పోటీపై తమ అధినేత ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంతో కేడర్ అసంతృప్తికి లోనవుతున్నారు. టీడీపీ, జనసేన పార్టీల్లో నాయకుల మధ్య సఖ్యత లేకపోవడం, గ్రూపు రాజకీయాలు తనకు చేటు చేస్తాయన్న ఆందోళనలో పవన్ ఉన్నట్టు తెలుస్తోంది. దీనికితోడు తనకు మంత్రి పదవి ఇవ్వకపోయినా జిల్లాల పునర్విభజన సందర్భంగా భీమవరాన్ని జిల్లా కేంద్రం చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కోరిన విషయాన్ని స్వయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల భీమవరంలో జరిగిన జగనన్న విద్యాదీవెన బహిరంగ సభ వేదికగా వెల్లడించడం ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు నియోజకవర్గంలో మరింత జనాదరణ పెంచింది. ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీని ప్రజలకు మరింత చేరువ చేశాయి. ఆయా ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతమవుతాయన్న ఆందోళనతో భీమవరం నుంచి పోటీచేసే విషయమై పవన్ కళ్యాణ్ పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది.

నేత్రపర్వం.. నారసింహుని చందనోత్సవం



చందనోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నారసింహుని చందనోత్సవం శనివారం నేత్రపర్వంగా జరిగింది. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా వేకువజామున ఆలయంలో నిత్యహోమాలు, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారి మూలవిరాట్‌కు చందన మహోత్సవాన్ని జరిపించారు. ఉగ్రరూపంలో ఉండే లక్ష్మీ నారసింహుడిని శాంతింపజేసే క్రమంలో జరిగిన ఈ ఉత్సవాన్ని వీక్షించిన భక్తులు పరవశించారు. ముందుగా పంచామృతాలతో స్వామిని అభిషేకరించారు. మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, అపబృదం, ధ్వజ అవరోహణ కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. ఆదివారం ఆలయంలో శ్రీపుష్ప యాగోత్సవం, పవళింపు సేవలతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

ఎస్సై.. శిక్షణకు సై

తమ కుమార్తె ఎస్సై ఉద్యోగానికి ఎంపికైందని ఓ తల్లి ఆనందం.. తన భర్త ఎస్సై శిక్షణకు వెళుతున్నాడని ఓ భార్య సంతోషం.. నాన్నను వదిలి ఉండలేక దిగులుతో వీడ్కోలు చెప్పిన ఓ చిన్నారి ముఖం.. ఇవి ఏలూరు డీఐజీ కార్యాలయం వద్ద కనిపించిన దృశ్యాలు. ఏలూరు రేంజ్‌లో ఎస్సై ఉద్యోగాలకు ఎంపికైన వారిని శిక్షణ నిమిత్తం ప్రత్యేక బస్సుల్లో శనివారం అనంతపురం పంపించారు. ఎస్సై అభ్యర్థుల కుటుంబసభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. - సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



అనంతపురం శిక్షణకు వెళుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు



మహిళా ఎస్సైల విజయ దరహాసం



బై.. బై.. అంటున్న కుటుంబ సభ్యులు

సేవ చేయడం అదృష్టం

ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్



ఎస్సైలకు సూచనలిస్తున్న ఐజీ అశోక్ కుమార్

ఏలూరు టౌన్: పోలీస్ ఉద్యోగమంటే ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయడమేనని, పోలీస్ అధికారిగా నియమితులు కావడం అదృష్టంగా భావించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎస్సై నియామక ప్రక్రియలో భాగంగా ఏలూరు రేంజ్‌లోని జోన్-2 పరిధిలో 105 సివిల్ పోస్టులకు 103 మంది అర్హత సాధించారు. వీరిలో 93 మంది ఎస్సైలను అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణకు పంపారు. ఎంపికైన వారిలో 12 మంది కానిస్టేబుళ్లు ఉండగా 45 మంది బీటెక్ గ్రాడ్యుయేట్లు, 46 మంది సైన్స్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ కార్యాలయంలో శనివారం ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ అధికారిగా ఉద్యోగం అరుదైన గౌరవంగా భావించి, ప్రతిఒక్కరూ శిక్షణా సమయంలో చట్టాలను ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన పెంచుకుని ప్రజలకు ఎలా న్యాయం చేయాలో నేర్చుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల నుంచి మెలకువలు, సూచనలు తెలుసుకుంటూ సక్రమమైన మార్గంలో ఉత్తమ అధికారులుగా బయటకు రావాలన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధిని చూసి ఓర్వలేకే దాడులు



కామవరపు కోట శివారు పాతూరు రోడ్డులో ధ్వంసం చేసిన శిలాఫలకం

కామవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వ్యతిరేక శక్తులు దాడులు చేస్తున్నాయని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కడిమి రమేష్, మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం చైర్పర్సన్ కేసర సరితరెడ్డి విమర్శించారు. శనివారం వారు మాట్లాడుతూ ఎంపీ కోటగిరి శ్రీధర్ ఈనెల 21న కామవరపుకోట నుంచి కేపీ రామవరం, జీలకర్రగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి కామవరపుకోట శివారు పాతూరులో శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారన్నారు. ఈ శిలాఫలకాన్ని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులను పట్టుకుని శిక్షించాలని కోరారు. ఈ ఘటనపై తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగన్ పాలనలో సంతోషంగా వ్యాపారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో వ్యాపార వర్గాలన్నీ సంతోషంగా ఉన్నాయని రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్‌జగన్ లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక సాయం అందిస్తున్న కారణంగా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి వ్యాపారాలు జోరుగా సాగుతూ వ్యాపార వర్గాలకు సానుకూల పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్ ప్రభుత్వంలో వ్యాపారులపై వివిధ శాఖల దాడులు తగ్గడంతో వారు స్వేచ్ఛగా వ్యాపారాలు సాగించగలిగారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని చంద్రబాబు విస్మరించగా వైఎస్ జగన్ ప్రభుత్వంలో నవంబర్ 1వ తేదీనే అధికారికంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించడం, పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి ఆర్యవైశ్యులకు అండగా నిలిచారన్నారు. టీటీడీ ట్రస్ట్‌బోర్డులో చంద్రబాబు ఒక్క ఆర్యవైశ్యునికి కూడా చోటు కల్పించలేదని, వైఎస్ జగన్ ప్రభుత్వంలో ముగ్గురు ఆర్యవైశ్యులకు ట్రస్ట్‌బోర్డులో స్థానం కల్పించి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అలాగే ఆర్యవైశ్యులను కించపరిచేలా ఉన్న చింతామణి నాటకాన్ని జగన్ ప్రభుత్వంలో నిషేధించి ఆర్యవైశ్యుల మనోభావాలకు తగిన గౌరవం చేకూర్చారన్నారు. ఆర్యవైశ్యుల్లోని 62 వేల మంది పేద మహిళలకు సీఎం జగన్ వివిధ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. పార్టీ వాణిజ్య విభాగం ఏలూరు నగర శాఖ కార్యదర్శి మోటమర్రి సదానంద కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు తగిన గుర్తింపు, రాజకీయ ప్రాధాన్యత కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ వాణిజ్య విభాగం ఏలూరు జిల్లా ప్రతినిధులు చలువాది బాలకృష్ణ, విజయకుమార్ జైన్, మద్దాల యుగంధర్ శ్రీనివాస్, తమ్మన రాంబాబు, బొలిశెట్టి సురేష్ కుమార్, గెద్దం అనిల్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుప్పం ప్రసాద్

పేద ఖైదీల విడుదలకు ఆర్థిక సాయం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్

ఏలూరు(మెట్రో): సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పూచీకత్తులు, జరిమానా చెల్లించలేక జైళ్లలో మగ్గుతున్న విచారణ, ఇతర ఖైదీల విడుదలకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా స్థాయి సాధికార కమిటీ సమావేశం కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వె.ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. 'పేద ఖైదీలకు మద్దతు' పథకం సామాజికంగా వెనుకబడిన, తక్కువ ఆదాయ వర్గాల ఖైదీలకు వారి బెయిల్ ష్యూరిటీ లేదా జరిమానా మొత్తాన్ని చెల్లించడానికి ఆర్థిక స్థోమత లేని వారి విడుదలకు సహాయం చేయడం లక్ష్యంగా మార్గదర్శకాలు జారీ అయ్యాయన్నారు. ఆర్థిక సహాయం అవసరమైన పేద ఖైదీలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రతి పేద ఖైదీ బెయిల్ పొందడం లేదా జరిమానా చెల్లించేందుకు ఆర్థిక సహాయం అవసరాన్ని అంచనా వేయడానికి ప్రతి జిల్లాలో సాధికార కమిటీని ఏర్పాటు చేశారన్నారు. దీనిలో భాగంగా శనివారం ఏలూరులో తొలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో సాధికార కమిటీ గౌరవ సభ్యులు, 7వ అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కె.రత్నప్రసాద్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జిల్లా జైళ్ల శాఖ అధికారి సీహెచ్ ఆర్‌వీ స్వామి, జిల్లా ప్రొబేషన్ అధికారి గ్రేడ్-1, నోడల్ అధికారి జె.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రక్కు ఆటో బోల్తా.. 11 మందికి గాయాలు

ముసునూరు: గోపవరంలోని నాగేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి వెళుతున్న భక్తుల ట్రక్కు ఆటో బోల్తా పడి 11 మంది గాయాలయ్యాయి. ఎస్సై పి.వాసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం వీరంపాలెంకు చెందిన భక్తులు శనివారం గోపవరంలోని నాగేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి బయలుదేరారు. కాట్రేనిపాడు-చిల్లబోయినపల్లి మార్గంలో వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆటో టైరు పేలడంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో వాహనంలోని 11 మంది కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో 20 మంది చేరిక



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి : లోకుమూడిలో 20 మంది వివిధ పార్టీలకు చెందిన నేతలు శనివారం సర్పంచ్ కర్రెడ్డి నాగమణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సదర్ల అశోక్, సాక చినబాబు, సదర్ల మధు, కుమార్, గెద్దం రమేష్, గోశాల సురేష్, పగోళ్ళ అశోక్, సదర్ల సతీష్ కుమార్, సదర్ల శ్రీనివాస్, సదర్ల ఆదాం, పాత్తూరి దావీదు, తులసి నాని, బత్తుల సాయి, మత్తె శ్రీను, తలారి కిరణ్, పాములూరి జయకుమార్, పాము శాంతయ, సమ్మెట తంబి వైఎస్సార్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

బాబు, కొడుకు నమ్మించి మోసం చేశారు



మాట్లాడుతున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

నూజివీడు: టీడీపీ పటిష్టానికి పదేళ్లపాటు కష్టపడి పనిచేస్తే బాబు, కొడుకు టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నూజివీడు నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. నూజివీడు మండలం యనమదలలో శనివారం రాత్రి బహిరంగ సదస్సు నిర్వహించి తనకు టీడీపీ చేసిన అన్యాయంపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ టీడీపీ పిలుపునిచ్చిన కార్యక్రమాలన్నింటిని విజయవంతంగా నిర్వహించినప్పటికీ చంద్రబాబు టికెట్ ఇవ్వకుండా తనకు వెన్నుపోటు పొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ పార్టీలో చేరని వ్యక్తికి టీడీపీ టికెట్ ఇచ్చారంటే టీడీపీ ఏ పరిస్థితుల్లో ఉందో ప్రజలందరూ అర్థం చేసుకోవాలన్నారు. తనను దారుణంగా మోసం చేసిన వారిని ఏం చేయాలో అభిమానులు, సానుభూతిపరుల నిర్ణయం మేరకు ఇక ముందు నడుచుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ అభ్యర్థులకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నమ్మించి మోసం చేసిన చంద్రబాబుకు తగిన శాస్తి చేయడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. తనకు టికెట్ ఇచ్చినా ఇవ్వకపోయినా నూజివీడు నియోజకవర్గాన్ని వదిలిపెట్టేది లేదన్నారు. రెండు సార్లు ఓడిపోయినప్పటికీ తాను నిరాశ చెందకుండా టీడీపీ అభివృద్ధికి పాటుపడ్డానన్నారు. నమ్మిన వారిని నట్టేట ముంచే చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి జెట్టి రాజీనామా



జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ఏఐసీసీ మెంబర్, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు, పార్టీ రాష్ట్ర కిసాన్‌సెల్ చైర్మన్ జెట్టి గురునాథరావు కాంగ్రెస్ పార్టీకి, తన పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు మెయిల్ ద్వారా పంపారు. రాజీనామా పత్రం కాపీలను ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌కు, పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డికి పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భవిష్యత్ కార్యాచరణ త్వరలో తెలియజేస్తానని చెప్పారు.

29లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని దుకాణాలు, వాణిజ్య సంస్థల యజమానులు ఈ నెల 29లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు కలిగిన, ఉద్యోగులు లేని సొంత వ్యాపార దుకాణాలు, సంస్థలు కూడా లైసెన్స్ తప్పనిసరిగా పొందాలన్నారు. సమీప గ్రామ సచివాలయంలో, మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతర్ రాష్ట్ర వలస కార్మికులను నియమించుకునే సంస్థలు, పరిశ్రమలు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఇంటిగ్రేషన్ రిజిస్ట్రేషన్ చట్టం 2015 కింద ఒకే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను పొందే వెసులుబాటు ఉందని డీసీఎల్ పేర్కొన్నారు.

130 సెల్‌ఫోన్ల రికవరీ

ఏలూరు ఎస్పీ డీ మేరిప్రశాంతి



ఓ మహిళకు ఫోన్ అందజేస్తున్న ఎస్పీ మేరి ప్రశాంతి

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న, చోరీకి గురైన బాధితులకు సెల్‌ఫోన్లను తిరిగి అందజేశామని ఎస్పీ డీ మేరి ప్రశాంతి చెప్పారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం బాధితులకు సెల్‌ఫోన్లను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఏలూరు జిల్లాలో తాజాగా 11వ దఫా సెల్‌ఫోన్ల రికవరీ భారీ ఎత్తున చేపట్టామని తెలిపారు. 2023 డిసెంబర్ నుంచి 2024 జనవరి వరకు పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు 130 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని చెప్పారు. ఏలూరు సీసీఎస్ సీఐ, సైబర్ క్రైమ్ సెల్ పోలీస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో సెల్‌ఫోన్లను రికవరీ చేస్తున్నారని అభినందించారు. రికవరీ చేసిన 130 ఫోన్ల విలువ సుమారుగా రూ.19.50 లక్షలు ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వారి సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్‌తో, వినియోగదారుల పూర్తి వివరాలతో 95503 51100 నంబర్‌కు వాట్సాప్‌లో సమాచారాన్ని ఇవ్వడం ద్వారా వాటిని రికవరీ చేసేందుకు పోలీసులు చర్యలు చేపడతారన్నారు. ఇప్పటివరకు 2,811 సెల్‌ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు రాగా వాటిలో 1,455 సెల్‌ఫోన్లను రికవరీ చేసి అందజేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.2.90 కోట్లు ఉంటుందన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై అప్రమత్తం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలు సోషల్ మీడియాలో పోస్టు చేసే సమాచారం విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మేరి ప్రశాంతి సూచించారు. ఆ పోస్టులు అల్లర్లు, అలజడులకు కారణమైతే పోస్టు చేసిన వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.